# రమణ .... మూర్తి ×

రచన :
శ్రీ జి. వి. ఆర్. ప్రసాద్.

రైలు దిగగానే నాల్గు ప్రక్కలా పరికించి చూశాడు మూర్తి. ఎక్కడా మనిషి జాడే కనబడలేదు. దూరంగా కిరసన్ దీపంలాగ వెలుగుతున్నాది ఒక ఎలక్ట్రిక్ లైటు. మెల్లిగా బెడ్డింగు తీసుకుని స్టేషనుమాష్టరు గదివైపు నడిచాడు. 'ఎవరూ?'' అంటూ బయటకు వచ్చాడు వీరాస్వామి. అతనే స్టేషనుమాష్టర. దానిని స్టేషను అనటానికి బదులు రేకుల షెడ్డు అని అంటే సరిపోతుంది. వీరాస్వామి మూర్తిని చూసి, 'ఏమండీ! తమరు గొల్లపాలెమేనా వెళ్లాలి?' అన్నాడు. 'అవునండీ. అక్కడ కొంచం పని వుంది. బండ్లేమైనా దగ్గిర్లో లేవా?' అన్నాడు. 'ఇప్పుడెక్కడ దొరుకుతాయండి అంటూ 'వీరాయ్' అని కేక వేశాడు. గదిలో ఒకమూల పడుకున్న వీరాయ్ కళ్ళు నులుపుకుంటూ వచ్చాడు. 'వీడు మీ బెడ్డింగు పట్టుకొస్తాడు. అయినా... ఉదయం బయలుదేరితే చాలా మంచిది' అన్నాడు ఆర్ద్రోక్తిగా. 'లాభం లేదండీ, అర్జంటు పని వుంది.' అని వీరాయ్ కి బెడ్డింగు అందించాడు. వీరాయ్ తనలో సణుక్కుంటూ వెంట బయలుదేరాడు.

గొల్లపాలెం స్టేషనుకి నాలుగు ఫర్లాంగుల దూరంలో వుంది. దారి అంతా కంకరతో నిండి వుండటమువల్ల నడక కొంచము కష్టంగా వుంది. దూరంగా నల్లటి కొండలు మబ్బుల్లా వున్నాయి. తాటిచెట్లు చీకట్లో భయంకరంగా అగుపడుతున్నాయి. వీరాయ్ తో సమంగా నడవలేక పోతున్నాడు మూర్తి. వీరాయ్ కి ఆ ప్రదేశం అంతా అలవాటే. చకచకా నడిచిపోతున్నాడు. రెండు మూడుసార్లు మూర్తిని హెచ్చరించాడు వేగరం నడవమని 'బాబూ! ఈ ప్రదేశం మీకు కొత్తదనుకుంటాను. అదీకాక యిది మంచి ప్రదేశం కాదండీ! అందులో రాత్రిపూట ప్రయాణానికి' అన్నాడు. మూర్తికి నవ్వు వచ్చింది. 'ఫర్వాలేదు నువ్వు ముందుకు నడుస్తుండు. నేను తాపీగా వస్తాను.' అన్నాడు 'బాబుగారూ!'' అన్నాడు వీరాయ్, ముఖంలో ఆశ్చర్యం, భయం, ఆందోళన ద్యోతక మవుచున్నాయి. వాడి పిరికితనానికి నవ్వు వచ్చింది. తన ధైర్యాన్ని చాటి చెప్పాలనిపించింది. ముఖంలోకి కొంచం కోపము తెచ్చుకొని 'నాకేం ఫర్వాలేదు. నువ్వు ముందు పో' అన్నాడు. వీరాయ్ మాట్లాడకుండా ముందుకు సాగిపోయాడు.

చూస్తుండగానే మూర్తి వెనకబడిపోయాడు. రెండు మూడు సార్లు వీరాయ్ వెనక్కి చూసి ముందుకు పోయాడు. మూర్తికి ఒక్కసారి స్వాతంత్రం వచ్చినట్లయింది. నాల్గు ప్రక్కలా చూసి ముందుకు అడుగు వేశాడు. ఎక్కడో నక్క వెలికిగా అరిచింది. ఒక గుడ్లగూబ భయంకరంగా అరుస్తూ మూర్తి తలమీంచి ఎగిరిపోయింది. మూర్తి గతుక్కుమన్నాడు. వెనకనించి యెవరో తనను చప్పట్లు కొట్టి పిలుస్తున్నట్లనిపించింది. ఒక్కసారి నిశ్చేష్టుడయ్యాడు. ఏదో తెలియని భయం గుండెల్ని పిండింది. భయపడుతూ వెనుకకు తిరిగేడు. దూరంగా ఏదో ఆకారం పడివడిగా తనవేపే వస్తున్నాది. మూర్తికి అడుగు ముందుకు పడలేదు. ఆ ఆకారం పది గజాల దూరం వచ్చింది. గాజుల గలగల విని

ఆశ్చర్య పోయాడు. ఆ ఆకారం దగ్గరకు వచ్చింది. ''ఏమండీ! మీది గొల్లపాలెమేనా?'' అంది. అవునని తలవూపేడు. ఇద్దరూ మెల్లిగా నడక ప్రారంభించారు. 'మాదీ గొల్లపాలెమే' నా పేరు సీత. నాయుడు వెంకటరత్నంగారు మా నాన్న అంది. మూర్తికి ఒక్కసారి గతం జ్ఞాపకం వచ్చింది. తను యెవరినైతే మోసగించాడో ఆమె ఇప్పుడు తన యెదురుగా యుంది. మళ్ళా ఆమెకి తన ముఖం చూపించకూడదనుకున్నాడు. కాని, యిప్పుడు జరిగినది యేమిటి? అయినా సీత తనను పోల్చుకోనందుకు చాల సంతోషించాడు. పరాయివాడిలాగే మాట్లాడి విడిపోతే యే బాధా వుండదు అని నిశ్చయించుకున్నాడు.

''ఏమండీ!'' అన్న పిలుపుతో యీ లోకం లోకి వచ్చాడు. మీరు చాలా పరాకుగా నున్నారు. మీ ఎదుట చూడండి అంటూ చూపింది సీత. ఎదురుగుండా ముళ్ళపొద కనబడింది. అక్కడినుంచీ రోడ్డు మలుపు తిరిగింది. ఆమె మళ్ళా చెప్పడం ప్రారంభించింది. 'నా చిన్నప్పుడు మా యింటికి పక్కనే రమణ వాళ్ళ యిల్లు వుండేది. రమణ చాలా మంచివాడు. నన్ను రోజూ స్కూలుకి దిగబెట్టేవాడు. ఒకనాడు జేమ్సు అనే కుర్రాడు అల్లరికి నా చెయ్యి పట్టుకుంటే వాడి ఒళ్ళు హూనం చేసేడు. అలాగ నాకే ప్రమాదం రాకుండా హైస్కూల్లో చదివే వరకూ సహాయ పడ్డాడు. రమణకి నేనంటే యెంతో యిష్టం అని నేను మురిసిపోయేదాన్ని. మా నాన్న అందరూ ఆలోచించి నన్ను రమణకిచ్చి పెళ్ళి చేద్దామనుకున్నారు' అంటూ చెప్పటం ఆపి మూర్తి కళ్ళలోకి సూటిగా చూసింది. మూర్తి హడలిపోయాడు. తనని పోల్చుకున్నదేమో అని. కాని ఆమె తన సహజ ధోరణిలో మళ్ళా చెప్పడం ప్రారంభించింది. కాని,...రమణ కాలేజీ చదువులకి పోయి నన్ను పూర్తిగా మరచిపోయాడు. అక్కడ సుశీల అనే ఆమెను వివాహం చేసుకున్నాడు. నన్ను మోసగించాడు. నా ఆశల్ని నేలపాలు చేశాడు. కృతఘ్నుడు అంటూ కోపంతో వూగిపోయింది. మూర్తి ఆమె రూపాన్ని చూసి గజగజ వణికిపోయాడు. 'నన్ను మోసగించి జీవితంలో సుఖపడుదామనుకున్న నీకు ఇంక జీవితంలో శాంతి వుండదు. ఇదే నా శాపం. గుర్తుంచుకో!' అంటూ గిరుక్కున తిరిగి మెరుపులా మాయమయింది.

మూర్తి శరీరం చమటలో గడ్డకట్టుకు పోయింది. ఆమె ఎక్కడికి పోయిందో అని భయపడ్డాడు. ఒక్క క్షణంకూడా ఆగక వీరాయ్‌ని సమీపించాడు. వీరాయ్ అప్పుడే వూరి దగ్గరకు వచ్చేశాడు. 'చూడు, వీరాయ్! ఈ వూళ్లో నాయుడు వెంకటరత్నంగారనే ఆయన ఇప్పుడు వున్నారా?' అన్నాడు. 'ఆళ్ల సంగతెందుకు బాబయ్యా! రమణ అనే అతను ఆళ్ళపిల్ల సీతను చేసుకోనన్నాడుట. పాపం, ఆ పిల్ల బెంగెట్టుకుని, ఆత్మహత్య చేసుకుంది. వాళ్ళ కుటుంబం బాధలు పడలేక వూరొదిలి వెళ్ళి......''అని చెప్పబోతూంటే, మూర్తి గాభరాగా 'ఏమిటీ! సీత ఆత్మహత్య చేసుకుందా? నిజంగానా?''అంటూ కలవర పడ్డాడు. వీరాయ్ అదేమీ గమనించకుండా 'బాబుగారు! తమరి పేరేమిటండీ?' అంటూ
గాడు. మూర్తి ఈ ప్రపంచం
'రమణమూర్తి, రమణ...మూ
అస్పష్టంగా.